भाकृ अनुप
ICAR

# కృషి

A magzine for Sustainable Agriculture

డి.డి.యస్
DDS

సంపుటి - 6

సంచిక - 9



జనవరి - జూన్ 2009



# మందు చెట్లు

## తంగేడు :

- కాల్తే : దీని ఆకులు మెత్తగా పొడిచేసి కాలిన దానిమీద పోయాలి.
- పుండ్లకి : దీని పొడి పుండ్ల మీద వేస్తే తక్కువైతుంది.
- కడుపునొప్పి : దీనితో కషాయం తాగితే తక్కువైతుంది.
- కడుపు నరాలు పట్టుకుంటే కషాయం తాగుతారు.
- దీని పువ్వు కూరగా వండుకుంటారు - ఈ పువ్వు తింటే చెక్కర వ్యాధి కంట్రోల్ అవుతుందంటారు.
- లేత కాయలు కూరగా వండుతారు.
- కండ్లకు కాయ కూర మంచిది.
- లేత ఇగుర్లు వాతము రాకుండా చేస్తుంది.
- శరీరానికి చలువ
- తలనొప్పికి దీని ఆకు తలకు కట్టుకుంటే తక్కువైతుంది.

| పోషకము | 100 గ్రా॥లో వుండే విలువ |
|---|---|
| మాంసకృత్తులు | 2.5 గ్రా |
| క్రొవ్వు | 2.2 గ్రా |
| ఖనిజ లవణాలు | 1.3 గ్రా |
| పీచు పదార్థం | 3.7 గ్రా |
| పిండి పదార్థాలు | 13.6 గ్రా |
| శక్తి | 84 కి.కెలరీలు |
| కాల్షియం | 167 మి.గ్రా |
| ఫాస్ఫరస్ | 42 మి.గ్రా |
| ఇనుము | 12.7 మి.గ్రా |
| బీట కెరొటీన్ | 1940 మ్యూ. గ్రా |
| విటమిన్-సి | 968.56 మి.గ్రా |



# 2008 సంవత్సరంలో కె.వి.కె. నందు జరిగిన ముఖ్య కార్యక్రమాలు

- ఆరోగ్య కార్యకర్తల ట్రైనింగు జరిగింది. ఈ కార్యక్రమములో పశువుల ఆరోగ్యం గురించి వారు ఏ నెలలో ఏమేమి వైద్యం చేయించాలో తెలపడం జరిగింది
- వాడుకలో లేని ఆహార పదార్థాలు మరియు వాటి పోషక విలువలు గురించి శిక్షణ జరిగింది.
- మామిడిలో అంటుకట్టడం (గ్రాఫ్టింగ్) పద్ధతిపై అవగాహనను కల్పించి రైతులకు ఏ విధంగా ఉపయోగకరంగా ఉంటుంది అను అంశంపై శిక్షణ కార్యక్రమం జరిగింది.
- స్థానిక ఆహార పదార్థాలు, ఆరోగ్య పద్ధతులు, పోషక విలువలు మొదలగు అంశాలపై చర్చను నిర్వహించారు.
- సంప్రదాయ వైద్యంలో చెట్ల మందుల తయారి మరియు వాటి ఉపయోగాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- ఆకుకూరల మీద అవగాహన కార్యక్రమమును నిర్వహించారు. ఇందులో భాగంగా ఆకుకూరలు, మందుచెట్లు, పూలు, పండ్లు చెట్లు ప్రాముఖ్యతను గురించి అనంతసాగర్, శేఖాపురం మరియు పర్వతాపురం గ్రామ మహిళలకు వివరించారు
- పశువైద్యం గురించి రైతుల నుండి సమాచారం సేకరించి పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు.
- గ్రామీణ మహిళలకు ఎంబ్రాయిడరీ పై శిక్షణా కార్యక్రమాన్ని ఏడాకులపల్లి నందు శిక్షణను ఇవ్వడం జరిగింది.
- సేంద్రియ వ్యవసాయం, ప్రయోజనాలు, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- పోషక విలువలు నష్టపోకుండా వంట వండే పద్ధతులపై జహీరాబాద్ ప్రాంతంలోని అంగన్‌వాడి వంట మనుషులుకు మరియు డిడియస్ బాల్వాడి వంట మనుషులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- అంగన్ వాడి కార్యకర్తలకు సహజ వస్తువులతో బోధనా పరికరాలను తయారుచేయడంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- ఏడాకులపల్లి గ్రామమునందు మహిళలకు మరియు బాలికలకు కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.
- సాంప్రదాయక వైద్యంలో త్రిఫల, జీవనధార, తెల్లపొడి మొదలైన చెట్ల మందుల తయారి విధానం, వాటి ఉపయోగాలు, వాటి ఔషధశక్తి గురించిన అంశాలపై సజ్జారావుపేటలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
- ఐ.సి.డి.యస్. అంగన్‌వాడి కార్యకర్తలకు పాతపంటల యొక్క ప్రాముఖ్యతను మన ఆహారంలో చిరుధాన్యాలు చేసే మేలును, పోషక విలువలను గురించి వివరించటం జరిగింది. ఈ కార్యక్రమం హుగ్గెల్లీలో జరిగింది.
- గ్రామీణ యువతకు ఫినాయిల్ తయారి విధానం పై శిక్షణ ఇవ్వటం జరిగింది.
- గ్రామీణ మహిళలకు మరియు తల్లులకు పిల్లలకు ఇవ్వవలసిన పౌష్టిక ఆహారం మరియు అవి ఏ విధంగా పిల్లల ఎదుగుదలకు కారణమవుతాయి అనే అంశాలపై చర్చించడం జరిగింది.
- కె.వి.కె. నందు కో-ఆపరేటివ్ సొసైటి వారిచే ఆహార భద్రత మరియు వ్యవసాయాభివృద్ధిపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ ఊర్లలో గల రైతులు హాజరైనారు.
- హెచ్.ఎన్.పి.వి. - వైరస్ ద్రావణంను ఉపయోగించే విధానం, శనగ పచ్చ పురుగును ఏ విధంగా నశింపజేస్తున్నది అనే అంశాలను రైతులకు తెలియజేయడం జరిగింది.
- మెదక్ జిల్లాలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులకు, సేంద్రియ ఎరువుల యొక్క ప్రాముఖ్యతను వివరించి, పంచగవ్య తయారి విధానంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి, దాని ఉపయోగాలను మరియు తయారు చేసే విధానాన్ని చూపించటం జరిగినది.
- వివిధ ప్రాంతాలకు చెందిన బాల్వాడి వంట మనుషులకు ఇందిరా క్రాంతి పథం సంస్థ వారి ఆధ్వర్యంలో పాత పంటలు మరియు వంటలు గురించి శిక్షణ కార్యక్రమాన్ని కె.వి.కె. నందు నిర్వహించారు.
- వాషింగ్ పౌడర్ తయారి విధానంపై పచ్చశాల బాలికలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- పిల్లతల్లులకు మరియు గర్భిణిలకు పోషకాహార విలువలను తెలియజేస్తూ, చిరుధాన్యాలతో (పాత పంటలో) తయారు చేసుకొనే వంటలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# భూసార పరీక్ష

**భూసార పరీక్ష**

మనకున్న పరిమిత సాగు భూమిలో అధిక దిగుబడులను సాధించటం మన కర్తవ్యం. అధిక దిగుబడులకు దోహదం చేసే వాటిలో సేంద్రియ ఎరువులు ముఖ్యమైనవి. కానీ భూములకు సరైన మోతాదులో వివిధ ఎరువులను వేయడం ఎంతైనా అవసరం. అయితే ఎరువులను అవసరమైన దానికంటే కొందరు ఎక్కువగాను, మరికొందరు తక్కువగాను వాడుతున్నారు. మోతాదుకు మించి వాడితే, పెట్టుబడి పీడ పీడల ఉధృతి పెరిగి నికర లాభం తగ్గుతుంది. తక్కువ మోతాదులో ఎరువులను వాడితే దిగుబడులు తగ్గుతాయి. అవసరమైన మేరకే ఎరువులను వాడితే నికర ఆదాయం పెరుగుతుంది. కాబట్టి భూమిలో ఉండే పోషక పదార్థాలను, పైర్లను పండించే పొలాల నుండి మనం మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి.

**భూసార పరీక్ష వలన లాభాలు :**

1. నేల స్వభావం, ఆ నేల ఏరకానికి చెందినదో తెలుసుకోవచ్చు.
2. మీ నేలకు అనుకూలమైన పంటను కూడా సూచించటం జరుగుతుంది.
3. నేలలో పోషక పదార్థాలు ఎంత పరిమాణంలో ఉన్నవో తెలుసుకోవచ్చు.
4. ఈ ఫలితాల వల్ల రైతు ఎరువులను కావాల్సిన మేరకు వాడి ఖర్చు తగ్గించుకొని దిగుబడులను పెంచుకోవడానికి ఉపయోగపడతాయి.

**ఏమి చెపుతారు :**

భూసార పరీక్ష కేంద్రాల వారు మట్టి నమూనాలను పరీక్ష చేసి, సమన్వయ పరిచి రైతులకు కొన్ని విషయాలను చెపుతారు.

1. తేలిక నేలా? బరువు నేలా? మధ్యస్థంగా ఉందా అనే విషయాలను తెలియజేస్తారు.
2. నేల ఉదజని సూచిన ఆధారంగా ఆ నేల ఆమ్ల గుణం కలిగి ఉందా లేదా క్షార గుణం కలిగి ఉందా లేదా తటస్తమా తెలియజేస్తారు.
3. నేల ఆమ్ల గుణం కలిగి ఉన్నచో, ఎంత మోతాదులో సున్నం వేసి బాగు చేసుకునేది తెలుపుతారు.
4. నేల క్షార గుణం ఉన్నచో జిప్సం వేసి ఏ విధంగా సరిదిద్దుకోవచ్చో చెప్తారు.
5. నీటిలో కరిగే లవణాలు (ఇ.సి) విత్తనం మొలవడానికి వీలుగా ఉందా? మొలకెత్తుటకు హానికరమా అనే విషయాలను తెలియజేస్తారు.
6. సేంద్రియ పదార్థం (ఒ.సి), లభ్య నత్రజని, భాస్వరం, పొటాష్‌లు ఏ స్థాయిలో ఉన్నవో తెలుపుతారు.
7. సమాచార పత్రంలో ఇచ్చిన సమాచారాన్ని చూసి మట్టీ పరీక్ష చేసాక వచ్చే ఫలితాలను విశ్లేషించి సేంద్రియ ఎరువు, నత్రజని, పొటాష్ ఎరువులను ఎంతెంత మోతాదులో వేయాలో తెలియజేస్తారు.

**మట్టి నమూనాలను సేకరించే సమయం :**

1. పైరు పొలంలో లేనప్పుడు
2. నేల పొడిగా ఉన్నప్పుడు అనగా పొలం బాగా ఆరి ఉండేటపుడు అనగా మార్చి నుండి మే నెల వరకు వర్షాలు పడక ముందర తీయాలి.
3. పండ్ల తోటల్లో చెట్లకు ఎలాంటి ఎరువు చల్లక ముందే మట్టి నమూనాలను సేకరించాలి.

**మట్టి నమూనాలను తీయవలసిన లోతు :**

మొక్కల వేర్లు పొయ్యేలోతు వరకు అనగా ఏక వార్షిక పంటలకు 15 నుంచి 30 సెం.మీ. వరకు మట్టి నమూనాలను సేకరించాలి.

1. ఇప్పుడు మనం కొన్ని ముఖ్యమైన పంటలు, ఎంత లోతులో మట్టి నమూనాలను సేకరించాలో తెలుసుకుందాం.

| | | |
|---|---|---|
| వరి పంటకు | – | 15 సెం.మీ. లోతు వరకు |
| జొన్నకు | – | 20 సెం.మీ. లోతు వరకు |
| శనగకు | – | 20 సెం.మీ. లోతు వరకు |

మట్టి నమూనాలను సేకరించాలి.

2. పండ్ల తోటలు అనగా మామిడి, నిమ్మ, సపోటా, జామ లాంటి పంటలకు 1.8 మీ లోతులో ప్రతి 30 సెం.మీ. కు ఒక నమూనా చొప్పున ఆరు నమూనాలను తీసి పంపించాలి.
3. చవుడు నేలలో అయితే 2 నమూనాలు తీయాలి. ఒకటి పైపొరలో 22.5 సెం.మీ. వరకు, రెండవది 22.5 సెం.మీ. నుండి 45 సెం.మీ. లోతు తీసి పంపించాలి.

**నమూనా తీసి పొలాన్ని ఎంపిక చేసే విధానం :**

ఒకే రకమైన పొలం అయితే ప్రతి 5 ఎకరాలకు ఒక నమూనా తీయాలి, అయిదు ఎకరాలకు మించితే 2 నమూనాలు, 15 ఎకరాలు అయితే 3 నమూనాలు తీయాలి. నేల వాలు, నేల రకం మొదలైనవి మార్పు ఉంటే 15 సెంట్లకైనా ఒక నమూనా తీయాల్సి వస్తుంది. నమూనా సేకరణకు ముందు పొలాన్ని యూనిట్లుగా విభజించాలి. దీనికి కొన్ని సూత్రాలున్నాయి. పొలం వాలును బట్టి నేల రకాన్ని బట్టి అనగా ఇసుక నేల, గరప నేల, నల్ల రేగడి నేల, ఓండ్రు నేల వంటి రకాలను బట్టి సేద్య విశేషాలకు అనగా పైరుకు ఎరువులు ఒకచోట ఎక్కువ, ఒకచోట తక్కువ వేస్తున్నారా? పైరు ఏ విధంగా పెరుగుతుంది? దిగుబడులు ఎట్లా వస్తున్నాయి? ఇవన్నీ పరిగణనలోనికి తీసుకోవాలి.

**మట్టి నమూనాలను సేకరించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

1. ఎరువులు వేసిన వెంటనే నమూనాలు సేకరించరాదు.
2. చెట్ల కింద, గట్ల ప్రక్కన, కంచెల దగ్గర సేకరించరాదు.
3. కంపోస్టు మరియు పశువుల ఎరువు కుప్పలు ఉంచిన చోట నమూనాలు తీయరాదు.

4. మట్టి నమూనాలు తీసేటప్పుడు నేల పై భాగంలోని చెత్త, చెదారం తీసి వేయాలి కాని పై మట్టిని తొలగించరాదు.
5. నీరు నిలిచి బురదగా ఉన్న నేల నుండి మట్టి నమూనాలు సేకరించరాదు.
6. తీసిన మట్టిలో తేమ ఎక్కువగా ఉన్నట్లైతే నీడల ఆరబెట్టాలి. ఎండలో ఆరబెట్టకూడదు.

**మట్టి నమూనా సేకరించే విధానం :**

1. భూసార పరీక్ష ఫలితాలు మనం సేకరించే మట్టి నమూనాల మీద ఆధారపడి ఉండును. కనుక మట్టి నమూనాలను ఒక యూనిట్ విస్తీర్ణంలో ఒక చోట నుండి కాక పది నుండి 15 ప్రదేశాలలో తీయాలి.
2. ఎంపిక చేసిన పొలంలో జిగ్-జాగ్ (ఎగుడు దిగుడు) పద్ధతితో 10 నుండి 15 చోట్ల గుర్తులు పెట్టాలి.





3. గుర్తులు పెట్టిన చోట్లపై నుండి చెత్త చెదారం తొలిగించి "వి" ఆకారంలో గోతులు తీయాలి. ముందు పేర్కొన్న విధంగా పైర్లను బట్టి గుంత లోతుండాలి.
4. ఆ గోతులలో ఒక అంగుళం (2.5 సెం.మీ) మందం పారతో పై నుండి కింది వరకు గీకాలి.
5. గీకిన మట్టిని తట్ట మీదనో లేదా చిన్న బకెట్‌లోనికి సేకరించి ఒకచోటు బండమీదగాని లేదా శుభ్రమైన పేపర్ మీద గాని పొయ్యాలి.



6. ఈ విధంగా ఆ పొలంలో 10 నుండి 15 చోట్ల సేకరించిన మట్టిని ఒక కుప్పగా పోసి బాగా కలపాలి.
7. ఆ విధంగా బాగా కలిపిన మట్టిని చతుర్భాగ పద్ధతిలో నాలుగు భాగాలుగా విభజించి పై రెండు భాగాలను 1,2 భాగాలుగాను, కింది రెండు భాగాలను 3,4 భాగాలుగా గుర్తించాలి. వీటిలో రెండు ఎదురెదురుగా భాగాలను కలిపి మిగిలిన రెండు భాగాలను తొలగించాలి.




8. మరల ముందుగా విభజించినట్లుగా నాలుగు భాగాలు చేసి రెండు ఎదురెదురు భాగాలను ఒలిగించి, మిగిలిన భాగాలను కలిపి, ఇలా పలు మార్లు చేసి అర కిలో మట్టి నమూనాను సేకరించాలి.



9. తరువాత ఈ మట్టి నమూనాను నీడలో ఆరబెట్టి పరిశుభ్రమైన పాలిథీన్ సంచిలో గాని, గుడ్డ సంచిలో గాని నింపి ప్యాక్ చేసి మీ దగ్గరలో ఉండే భూసార పరీక్ష కేంద్రానికి పంపాలి.

**మట్టి నమూనాతో పంపాల్సిన సమాచార పత్రం - వివరాలు :**

1) (ఎ) నమూనా నెం. : (బి) సర్వే నెం. :
2. రైతు పేరు : 3. గ్రామం :
4. మండలం : 5. జిల్లా :
6. నమూనా తీసిన తేది :
7. నేల యొక్క పరిస్థితి : ఇసుక నేల / గరప నేల / నల్ల నేల
8. నీరు ఇంకే గుణం : ఎక్కువ / తక్కువ / ఒక మాదిరిగా
9. భూమి యొక్క ఏటవాలు : ఎక్కువ / ఒక మాదిరిగా / చదునుగా ఉంది.
10. గత మూడు సీజన్లలలో వేసిన పంటలు - వాడిన ఎరువులు - దిగుబడులు
11. వేసే పంట వర్షాధారపు పంట / నీటి పారుదల నీటి పారుదల అయితే బావులా / చెరువులా / కాలువలా
12. వేసే పైరు వివరాలు

పైన కనబరిచిన సమాచార పత్రంతో పాటు మట్టి నమూనాను నేరుగా గాని లేదా మండల వ్యవసాయ విస్తరణ అధికారి ద్వారా కాని లేదా మండల వ్యవసాయ అధికారి ద్వారా గాని లేదా మీకు సమీపంలో భూసార పరీక్ష కేంద్రానికి పంపి భూసార పరీక్ష చేయించుకొని వారి సలహా మేరకు మీరు ఎరువులు వాడినట్లైతే మంచి దిగుబడులు సాధించవచ్చు.

# సాంప్రదాయ పశువైద్యం

## రోగం వున్న పశువు లక్షణాలు :

1) మేత మేయదు
2) నెమరు వేయదు
3) మందలో కలవదు, సుస్తుగా ఉంటుంది.
4) కండ్ల నుంచి, ముక్కు నుండి నీరు కారుతుంది.
5) చెవులు క్రిందికి జారి చేజారుగా ఉంటుంది.
6) జ్వరం ఉంటుంది.
7) పాలు పితికేటప్పుడు దాణా తినకుండా నిలబడితే దాన్ని జ్వరం లేదా అజీర్తిగా అనుమానించాలి.

## రోగం వచ్చినప్పుడు పశువుకు తీసుకోవలసిన జాగ్రత్తలు :

1) పశువును సాఫ్‌గా (శుభ్రంగా) ఉంచిన కొట్టంలో వుంచాలి.
2) పెండ, మూత్రంలను వెంటనే శుభ్రం చేయాలి.
3) చలికాలం అయితే పశువుకు గర్మి వుండేట్లు చూడాలి. పశువుకు గోనె పట్టలు కప్పాలి.
4) పశువు ఆరామ్‌గా ఉండేటట్లు మంచి పశువులు తినగా వదిలిన (ఎండుగడ్డి) మేతలో పడక చేయాలి.
5) పశువుకు అల్కాగా జీర్ణం (సులువుగా జీర్ణం) అయ్యే మేత ఇవ్వాలి.
6) పశువు మేత మేయకుంటే, ఏదైనా అంబలి ఇవ్వాలి.
7) త్రాగే నీటి తొట్టి అలగ్ (వేరు) పెట్టాలి.
8) పశువును కొద్ది దూరం నడిపిస్తే కాళ్ళు కదలిక ఉంటుంది.

# పప్పు ధాన్యాలు - పోషక విలువలు

పప్పు ధాన్యాలు సమృద్ధిగా మాంసకృత్తులను అందిస్తాయి. శరీర నిర్మాణానికి వివిధ రకాల జీవరసాయనిక చర్యలకు, ఎదుగుదలకు, శరీర ధారుడ్యానికి అవసరమైన మాంసకృతులు పప్పు ధాన్యాలనుండి ధారాళంగా లభిస్తాయి. శాఖాహారములోను మరియు మాంసాహారము తక్కువగా తీసుకునే వారిలోను పప్పు ధాన్యాలకు ప్రముఖ పాత్ర వుంది. ప్రధానంగా పప్పు ధాన్యాలు బి-కాంప్లెక్స్ విటమినులను ఇస్తాయి. మొలకెత్తిన పప్పు ధాన్యాలు విటమిన్-సిని కూడా కలిగి ఉంటాయి. మాంసకృత్తులు వివిధ రకాల అమైనో ఆమ్లాలను కలిగి ఉంటాయి.

మెదక్ జిల్లా జహీరాబాద్ ప్రాంతంలో ముఖ్యంగా దొరికే పప్పు ధాన్యాలు పెసర్లు, మినుములు, తొగర్లు(కంది) అనుములు, బెబ్బర్లు, ఉలవలు, శెనగలు, బటగాళ్ళు (బఠాణి), లంకలు మరియు శిరి శెనగలు. వ్యవసాయ జీవ వైవిధ్యానికి నెలవైన పొలాలో ఇక్కడి రైతులు ప్రతి పంటలోను రెండు మూడు రకాలను పండిస్తారు. క్రింది పట్టికలో ప్రతి పంటకి ఉన్న ప్రత్యేక లక్షణాలు వివరించటం జరిగింది.

| పంట | ఆహార మరియు ఆరోగ్య ప్రత్యేకతలు |
|---|---|
| మంచి పెసరి | ఇది చాలా పత్యం పంట. కాస్కర్ ఇంట్లో తిననీకి వాడుతారు. |
| గంగ పెసరి | ఇది బాలెంతలకు, నొప్పిరోగం ఉన్నవాళ్ళకు పెట్టొచ్చు. ఇది బర్కత్ పంట. |
| బాలెంత పెసరి | గుడాలకు బాగా ఉంటాయి. |
| తీగ పెసరి | ఇది పత్యం పంటగా వాడతారు. తినడానికి చాలా రుచిగా ఉంటుంది. |
| దేశి మినుములు | అన్ని రకాల పత్యం కొస్తది. పశువులకు కూడా బాగ పనికొస్తది. ఇది భూమికి, మనుషులకు, పశువులకు బలాన్ని ఇస్తుంది. |
| ఎర్రతొగరి | ఇది పత్యం పంటగా వస్తుంది. శూన్యం పండుగకు బజ్జి కూరవండి భూతల్లికి పెడతారు. |
| బుర్కతొగరి | పత్యం పంటగా వాడతారు శూన్యం పండుగకు బజ్జికూర వండి భూతల్లికి పెద్తరు. |
| తెల్లతొగరి | శూన్యం పండుగకు బజ్జికూర వండి భూతల్లికి పెద్తరు. |
| నల్లతొగరి | శూన్యం పండుగకు బజ్జికూర వండి భూతల్లికి పెద్తరు. |
| తెల్ల అనుములు | కాయ ఉంటే ఉడక బెట్టుకుని తింటరు. కాయ వొలిచి బజ్జికూర చేస్తరు. గుడాలు ఏసుకొని తింటారు. |
| నల్ల అనుములు | కాయ ఉంటే ఉడకబెట్టుకుని తింటారు. కాయ వొలిచి బజ్జికూర చేస్తరు. గుడాలు ఏసుకొని తింటరు. |

ఎర్ర అనుములు — గుడాలు ఏసుకుంటారు. ఎర్ర అనుములకు వాతం వస్తుంది. కొందరి ఈ గుడాలు పెయికి పడవు ముఖాలు అవి ఉబ్బుతాయి. కాయ ఉడకబెట్టుకొని తింటారు.

ఎర్రబెబ్బర్లు — పప్పు చారు చేస్తరు, గట్టికూర చేస్తరు, గుడాలు చేస్తరు.

తెల్ల బెబ్బర్లు — పప్పుచారు చేస్తరు, గట్టికూర చేస్తరు, గుడాలు చేస్తరు.

ఉల్వలు (తెల్ల, ఎర్రనల్ల) — పత్యంకు వస్తుంది. వాతం అయితే నల్ల ఉల్వ గుడాలు వేసి తిన పెడితే తక్కువయితది. గుడాలు వేసుకుంటారు. ఉల్వ చారు చేసుకుంటారు. ఉలవ తిండి మనుషులకు, పశువులకు చాలా బలమైనది.

దేశి శనిగెలు ఎర్రవి — అన్ని పండగలకు వస్తది. పోలెలకు వస్తది. ధర బాగుంటుంది. బర్రెలు ఈనినప్పుడు శనిగె పప్పు బెల్లం కలిపి పెడతారు.

నల్ల శనిగ — పోలెలకు, బజ్జిలకు, బూందికు, ఖారకు, మురుకులకు వస్తది. పోలెలకొస్తది.

తెల్లశనిగ — పోలెలకు, బజ్జిలకు, బూందికు, ఖారకు, మురుకులకు వస్తది. పుట్నాలు బాగా అవుతాయి.

నల్ల బటగాల్లు — నల్ల బటగాళ్లు – జ్వరం వస్తే నోటికి పట్టుకొననికి ఇస్తారు పప్పుకూడా తింటారు. బటానీలు చేసి అమ్ముతారు, పుట్నాలు చేస్తారు, గుడాలు చేస్తారు.

తెల్ల బటగాల్లు — బటానీలు చేసి అమ్ముతారు, పుట్నాలు – గుడాలు చేస్తారు.

శిరి శనగ (నల్లవి) (చిన్న,పెద్ద) — ఈ పప్పు ఎక్కువ తింటే మనిషికి నంజు వస్తుంది. ఈ పప్పు పెండ్లిలకు, పోలెలు చుట్టేటప్పుడు పనికి వస్తుంది. ఈ పంటకి కలుపు తియ్యరాదు. తీస్తే గొడ్డు పోతుంది. కాత కాయదు. మరిగే నీళ్ళలో పప్పు వేసి 2 నిమిషాలు ఉంచి, నీటిని పారబోసి, పప్పును వండాలి. పప్పులో వుండే “నంజుగుణం” దీని వల్ల నశిస్తుంది.

లంకలు — ఈ పప్పు ఎక్కువ తింటే వాతం వస్తుంది. ఈ పప్పు ఎద్దుకు బలం రావటానికి సాయంత్రం పూట పప్పును నానబెట్టి కొంచెం, ఉప్పు రవ్వలు వేస్తారు. అరకు నుండి రాగానే ఎడ్లకు దాణాగా ఇనుప గంపలో నింపి పెడ్తారు. లంక పిండితో బజ్జీలు, గారెలు, జొన్నలో లంకల పిండి కలిపి రొట్టెలు చేస్తారు.

## 100 గ్రా. పప్పల్లో పోషక విలువలు

| | ప్రోటీన్ గ్రా. | క్రొవ్వు గ్రా. | లవణాలు గ్రా. | నార గ్రా. | పిండి పదార్థాలు గ్రా. | శక్తి కిలో గ్రా. | కాల్షియం మి. గ్రా. | ఫాస్పరస్ మి. గ్రా. | ఇనుము మి. గ్రా. | కెరొటిన్ మైక్రో గ్రా. | బి1 మి. గ్రా. | బి2 మి. గ్రా. | నయాసిన్ మి. గ్రా. |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| **సెనగలు** | 20.8 | 5.6 | 2.7 | 1.2 | 59.8 | 372 | 56 | 331 | 9.1 | 129 | 0.48 | 0.18 | 2.4 |
| **మినుములు** | 24.0 | 1.4 | 3.2 | 0.9 | 59.6 | 347 | 154 | 385 | 9.1 | 38 | 0.42 | 0.37 | 2.0 |
| **బెబ్బర్లు** | 24.1 | 1.0 | 3.2 | 3.8 | 54.5 | 323 | 77 | 414 | 5.9 | 12 | 0.51 | 0.20 | 1.3 |
| **అనుములు** | 24.9 | 0.8 | 3.23 | 1.4 | 60.1 | 347 | 60 | 433 | 2.7 | 0 | 0.52 | 0.16 | 1.8 |
| **పెసర్లు** | 24.5 | 1.2 | 3.5 | 0.8 | 59.9 | 348 | 75 | 405 | 8.5 | 49 | 0.72 | 0.15 | 2.4 |
| **ఉల్వలు** | 22.0 | 0.5 | 3.2 | 5.3 | 57.2 | 321 | 287 | 311 | 8.4 | 71 | 0.42 | 0.20 | 1.5 |
| **లంకలు** | 28.2 | 0.6 | 2.3 | 2.3 | 56.6 | 345 | 90 | 317 | 6.3 | 120 | 0.39 | 0.17 | 2.9 |
| **సిరిసెనగలు** | 25.1 | 0.7 | 2.1 | 0.7 | 59.0 | 343 | 69 | 293 | 4.8 | 270 | 0.45 | 0.20 | 2.6 |
| **తొగర్లు** | 22.3 | 1.7 | 3.5 | 1.5 | 57.6 | 335 | 73 | 304 | 5.8 | 132 | 0.45 | 0.19 | 2.9 |
| **బటాగాళ్ళు** | 19.7 | 1.1 | 2.2 | 4.5 | 56.5 | 315 | 75 | 298 | 5.1 | 39 | 0.47 | 0.19 | 3.4 |

సేకరణ : భారతీయ ఆహార పదార్ధాల పోషక విలువలు, జాతీయ పోషకాహార సంస్థ, ఐ.సి.యం.ఆర్., హైదరాబాద్.

# విత్తన నిల్వలో మెలకువలు -సాంప్రదాయక పద్ధతులు

పంటకు కోసిన తరువాత, దానిని ఆహార రూపంలో తీసుకుంటాం. ఆహారంగా తీసుకుంటాం. ఆహారంగా తీసుకునే ముందు చాలా వరకు పంటను నష్టపోతున్నాం. ముఖ్యంగా భారత దేశంలో సరయిన పద్ధతులను పాటించకపోవడం వల్ల చాలా నష్టం జరుగుతుంది. మనం పంట పండించిన తర్వాత పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే ఇటువంటి నష్టాలను తగ్గించాలి. పంట నష్టాలు రైతు స్థాయిలో ఎక్కువగా జరుగుతున్నాయి. కాబట్టి రైతు స్థాయిలోనే వాటిని నివారించుకోవలసి ఉంది.

పంటకోస్తున్న సమయంలో, మార్పిడి చేస్తున్నప్పుడు, ఒక చోట నుండి వేరే చోటుకు తరలిస్తున్నప్పుడు, నిల్వ చేస్తున్నప్పుడు, ఇటువంటి నష్టాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎలుకల వలన, పక్షుల వలన, శలీంధ్రాల వలన, తేమ వలన 10% పంటను నష్టపోతున్నాము. ఇవే కాకుండా రాళ్ళు, దుమ్ము మొదలయినవి కూడా విత్తనం / ధాన్యం నాణ్యతను తగ్గించేస్తున్నాయి. ఉత్పత్తి చేసిన తర్వాత నాణ్యతను కాపాడడం కోసం విత్తనాన్ని సరైన పాత్రలు, సంచులలో నిలువ చేయాలి.

## తేమను నియంత్రించే పాత్రలు / సంచులు :

(1) అల్యూమినియమ్ డబ్బాలు

## తేమను తట్టుకునే పాత్రలు / సంచులు :

1) కర్ర డబ్బాలు, వెదురు గాదెలు, గంప గుల్లలు

2) కుండలు

3) సిమెంట్ ఒరలు గాదెలు

4) గుమ్మి

5) మట్టికుండ - పప్పు జాతి విత్తనాల నిల్వకు అనుకూలమైనది.

6) మట్టిజాడి - రాగులు, వడ్లు, జొన్నల నిల్వకు అనుకూలమైనది.

## విత్తన నిల్వ పద్ధతులు :

1. విత్తనాలను వాయిల లేదా వెదురు డబ్బాలలో చేసిన గంపలలో భద్రపరుస్తారు. ఈ గంపలను మొదట ఆవు పేడతో అలుకుతారు. ఈ విధంగా అలికినపుడు ఎక్కువ గాలి జోరే అవకాశం లేకుండా చూస్తారు. ఈ అలికిన గంపలను నీడలో బాగా ఆరబెట్టి, తరువాత దానిలో విత్తనాలను పోసి దాస్తారు. తయారైన గంపలలో విత్తనాలను నిల్వ చేసేటప్పుడు విత్తనానికి బూడిద మరియు వేపాకుల /వేపాకు పిండితో కలుపుతారు.

2. వరి, గోధుమ, చిరు ధాన్యాలు సాధారణంగా గుండ్రటి లేదా చతుర్భుజ ఆకారపు మట్టి పాత్రని గాని, వెదురుతో చేసిన పాత్రని గాని ఉపయోగించవచ్చు. ఈ పాత్రలను భూమి నుండి 12 అంగుళాల ఎత్తైన ప్రదేశంలో ఉంచాలి. ఎండిన వేపాకుల పొర ఏర్పరిస్తే చీడలు, తెగుళ్ళు నుండి కాపాడుకోవచ్చు.

3. మొక్క జొన్న, సజ్జలు : ఎండిన మొక్కజొన్న/ సజ్జ కండికలు/ కంకులు ఒలవకుండా 3-4 మీ॥ ఎత్తులో గుంజకు కట్టి ఉంచు నిల్వ చేయవచ్చు.

4. కూరగాయల విత్తనాలు : వంగ, గుమ్మడి, మిరప, బెండ, దోస మొదలయిన కాయలను పొలంలోనే పక్వానికి రానిచ్చిన తర్వాత తీసి కాయల రూపంలోనే నిల్వ ఉంచాలి. కాయలను బట్ట కట్టి ఇంట్లో వేలాడదీయాలి. ఇలా నిల్వ చేసి వేలాడదీసిన వాటిని అప్పుడప్పుడు పొగ తగిలే విధంగా చేయాలి.

### విత్తన నిల్వ - నిర్వహణ :

1. నిల్వచేసే పరికరాలలో, స్థలంలో తేమ లేకుండా, చల్లగా ఉండాలి.

2. సూక్ష్మ జీవులు చీడపీడలు, ఎలుకల దాడినుండి విత్తనాన్ని కాపాడాలి.

3. తేమను తగ్గించడం కోసం ఎండబెట్టిన విత్తనాలను నిల్వ చేయాలి.

4. నిల్వ ప్రదేశాల్ని వేపకషాయాలతో గాని, ఎండిన వేప ఆకులతో పొగ బెట్టిగాని శుభ్రంగా ఉంచాలి.

# సేంద్రియ ఎరువులు - పంచగవ్య

పంచగవ్య అనునది ఒక సేంద్రియ మిశ్రమము. ఈ మిశ్రమాన్ని తరాల నుండి భారతీయ వైద్యంలో ఉపయోగిస్తు వస్తున్నారు. ఇటు జంతువులకు అటు మొక్కలకు అనేక విధాలుగా ఉపయోగపడే సరికొత్త పంచగవ్యను తమిళనాడుకి చెందిన స్వచ్ఛంద సంస్థ రూరల్ కమ్యూనిటీ ఏక్షన్ సెంటర్ అధ్యక్షులు డా॥ కె. నటరాజన్ గారు తయారు చేసారు. ఈ సంస్థ సేంద్రియ వ్యవసాయానికి మరియు జీవ ఇంధనాల అభివృద్ధికి పాటుపడుతుంది. పంచగవ్య రైతులు తమంతట తామే తయారు చేసుకోగల సేంద్రియ ఎరువు. పంచగవ్య మొక్క పెరుగుదలకే కాక చీడ పీడలను దరిచేర నీయదు. అన్ని రకముల పంటపై దీనిని వాడుకొనవచ్చును. దీనిని తయారు చేసుకొనే విధానమును తెలుసుకొందాము.

### కావలసిన పదార్థాలు :

1) ఆవుపేడ - 5 కిలోలు
2) ఆవుమూత్రము - 3 లీటర్లు
3) ఆవు పెరుగు - 2 లీటర్లు
4) ఆవు పాలు - 2 లీటర్లు
5) ఆవు నెయ్యి - 1/2 కిలో
6) లేత కొబ్బరి నీళ్ళు - 3 లీటర్లు
7) కల్లు - 3 లీటర్లు
8) పండిన అరటి పండ్లు - 12-15
9) నీరు - 3 లీటర్లు
10) బెల్లము - 1 కిలో

## తయారు చేసే విధానం :

1) ఆవు పేడను, చల్లార్చిన ఆవు నెయ్యిని ఒక కుండలేదా డ్రమ్‌లో కాని వేసి చేతితో బాగా కలపాలి. తడిగుడ్డతో కప్పి నాలుగు రోజులు ఉంచాలి.
2) ప్రతిరోజు ఒకసారి చేతితో కలపాలి. నాలుగు రోజులకు పేడలో నెయ్యి పూర్తిగా కరుగుతుంది.
3) 5వ రోజున ఈ కుండలో ఆవు మూత్రం, ఆవు పాలు, ఆవు పెరుగు, బెల్లం, కొబ్బరి నీరు, కుళ్ళిన అరటి పండ్లు లాటి/ఈతకల్లు వేసి బాగా కలిసి 15 రోజుల పాటు ఉంచాలి.
4) పదిహేను రోజులపాటు ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం తప్పని సరిగా చేతితో బాగా కలపాలి.
5) 16వ రోజునుంచి 6 నెలలు పాటు దీనిని వాడుకోవచ్చు. ఈ మధ్య కాలంలో ప్రతిరోజు ఒకసారి కలపాలి.

## పంటలకు వాడు విధానం :

3 లేదా 4 శాతం గాఢతలో పంచగవ్యను అన్ని పంటలపై పిచికారి చేస్తే మంచి ఫలితాలను ఆశించవచ్చు. అంటే 3 లీటర్లు పంచగవ్యను 100 లీటర్ల నీటిలో కలపి పిచికారి చేయాలి. పొలానికి నీరు పెట్టేటప్పుడు ఒక ఎకరానికి 5 నుంచి 20 లీటర్లు పంచగవ్యను చేను మొదట్లో కలిపి ఇవ్వవచ్చు.

ఈ పంచగవ్యను 200 మి.లీ., రోజుకు తినబెట్టుట వలన ఆవులు మంచి ఆరోగ్యవంతముగా తయారై అధిక కొవ్వు శాతములో పాల దిగుబడి వచ్చెనని డా॥ కె. నటరాజన్ తెలిపారు.

### ఉపయోగాలు :

1) మొక్క పెరుగుదల బాగుంటుంది.
2) పురుగులు, తెగుళ్ళను దూరంగా ఉంచుతుంది.
3) మొక్క వేళ్ళ దగ్గర వ్యాధి నిరోధకత పెరుగుతుంది.
4) ఆకుల మీద చల్లితే నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మపోషక పదార్థాలు మొక్కకు అందుతాయి.
5) అంతేకాకుండా, 5 మి.లీ. పంచగవ్యను కోళ్ళకు ఒక రోజుకి ఇవ్వటం వలన కలిపిగాని లేదా త్రాగే నీటిలో కలిపి కోళ్ళకు ఇవ్వటం వలన రోగములేవి లేకుండ చాలా రోజుల వరకు గుడ్లు పెట్టడం జరిగింది. మాంసమునకు అమ్మేకోళ్ళలో, బరువు పెరిగి ఆకర్షణీయంగా ఉంటాయి.

## డి.డి.యస్. - కె.వి.కె.
## శిక్షణా కార్యక్రమాల వివరాలు

1) పంచగవ్య తయారి మరియు వాడే విధానం. చీడ, పీడ నివారణకు వాడే వివిధ రకాల కషాయాల తయారి విధానం మరియు మోతాదు వాడకం.
2) వర్మీకంపోస్టు తయారి విధానం మరియు నిర్వహణ.
3) తొగరి పంటలో పర్యావరణ సన్నిహిత సస్యరక్షణ చర్యలు/ పద్ధతులు.
4) తొగరి సాగులో సేంద్రియ వ్యవసాయ పద్ధతులు.
5) పంట వైవిధ్యం మరియు లాభాలు.
6) సేంద్రియ ఎరువుల ఉత్పత్తి విధానాలు మరియు వాడుక విధానాలు
7) వేసవిలో పొలం పనులు.
8) వేరుశనగ సాగు యాజమాన్య పద్ధతులు
9) గడ్డినువ్వుల సాగు యాజమాన్య పద్ధతులు
10) రైతు క్లబ్బుల ప్రాధాన్యత
11) మంచి నువ్వు సాగు యాజమాన్య పద్ధతులు.
12) ఎరువు చెట్ల వల్ల పంటల సాగు ప్రయోజనాలు మరియు యాజమాన్యం.
13) గ్రామీణ స్థాయిలో తయారు చేసుకొనే వంటలలో పోషకాల స్థాయిని పెంపొందించటం.
14) నర్సరీ పెంచడంపై శిక్షణా కార్యక్రమాలు
15) నీటి కుంటల నిర్మాణ పద్ధతులు.
16) ధాన్యం నిలువ చేయుటలో సాంప్రదాయ పద్ధతులు.
17) భూమి మరియు నీటి సంరక్షణ పద్ధతులు.
18) చెట్ల మందుల తయారీ పద్ధతులు
19) ఆహారం నిల్వలో జాగ్రత్తలు
20) పప్పు ధాన్యాల పంటల చీడపీడలు నివారణ
21) ఆహారంలో ఆకుకూరల ప్రాముఖ్యత
22) తక్కువ ఖర్చుతో భోదన పరికరాలు తయారు చేయడం.
23) పశుగ్రాసంలో అజోల్లా ప్రాముఖ్యత
24) అడవి పండ్లుపై అవగాహన
25) చిరుధాన్యాలతో వైవిధ్యమైన వంటలు/వీటి పోషక విలువలు.

**మెదక్ జిల్లా ప్రాంత రైతులకు శుభవార్త**

**డి.డి.యస్. - కృషి విజ్ఞాన కేంద్రము జహీరాబాద్. నందు**

**మట్టినమూన పరీక్ష కేంద్రం**

**SOIL, WATER, PLANT TESTING LAB**

**ప్రారంభించడమైనది**

**మా సేవలు వినియోగించుకోగలరని**

**మీ అందరికి ఇదే మా ఆహ్వానం**



# మందు చెట్లు

## దూసరి :

- మూత్రం మంటకి దీని ఆకు తింటారు. నొప్పి తగ్గడానికి దీన్ని ఉపయోగిస్తారు.
- కడుపు నొప్పికి, కడుపులో మంటకి కూడా తింటారు.
- పైఖాన సాఫ్ రావాలంటే దీని ఆకులు తింటారు.
- రక్తం బైలు, చీము బైలు తగ్గాలంటే కూడా దీని ఆకులు తింటారు.
- ఇది శరీరానికి చలువ, గరిమి పెయ్యికి మంచి.
- అంటు వ్యాధుల్ని రానివ్వదు.
- దీన్ని కూరగా వండుకుని తింటారు. పచ్చి ఆకుల్ని ప్రతి ఒక్కరూ తింటారు.
- దీని ఆకు రసం నీళ్ళల్ల పంపితే గడ్డ కడ్తుంది. అండ్ల నహ్వంది వేసుకుని తింటారు. చెక్కర వ్యాధికి తింటారు.
- రుతుక్రమానికి సంభధించిన వ్యాదుల నివారణకు మరియు అధిక రక్తస్రావాన్ని అరికట్టడానికి ఈ ఆకులను తింటారు

| పోషకము | 100 గ్రా॥లో వుండే విలువ |
|---|---|
| మాంసకృత్తులు | 9.1 గ్రా |
| క్రొవ్వు | 1.9 గ్రా |
| ఖనిజ లవణాలు | 3.2 గ్రా |
| పీచు పదార్థం | 7.6 గ్రా |
| పిండి పదార్థాలు | 33.8 గ్రా |
| శక్తి | 189 కి.కెలరీలు |
| కాల్షియం | 1152 మి.గ్రా |
| ఫాస్పరస్ | 107 మి.గ్రా |
| ఇనుము | 10.7 మి.గ్రా |
| బీటా కెరొటీన్ | 4305 మ్యూ.గ్రా |
| విటమిన్-సి | 232.17 మి.గ్రా |





# సంఘం రేడియో వినండి

**పాటలు, కథలు, బుర్ర కథలు, పర్యావరణ సన్నిహిత స్థానిక వ్యవసాయం, ఆడవాళ్ళ అంశాలు, మొదలగు వాటిపై అవగాహన కార్యక్రమాలు, చర్చలు 90.4 మీటర్ల మీద ప్రతి రోజు రా॥ గం. 7.00 నుండి గం. 9.00 వరకు**

**◆ వినండి ◆ విజ్ఞానం పొందండి ◆**









చిరునామా


వివరాలకు :

**డి.డి.యస్. - కె.వి.కె.**

పోస్ట్ బాక్స్ నెం. 214,
జహీరాబాద్ - 502 220. మెదక్ జిల్లా
ఫోన్ : 08451 - 282809



సంపాదకులు

**డా॥ శ్రీమతి శైలజ కుర్రా**

ప్రోగ్రామ్ కోఆర్డినేటర్

**శ్రీమతి పి. కిరణ్ వాణి**

వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త